## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**90324 97123**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### వీసీని కలిసిన సెయింట్ జోసెఫ్ సిబ్బంది



వీసీని అభినందిస్తున్న సెయింట్ జోసెఫ్ సిబ్బంది

**కంచరపాలెం:** ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను మంగళవారం జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఆధ్యాపక సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ మేరీ, డాక్టర్ పీకే జయలక్ష్మి, నాన్సీ, దీపాలి, డాక్టర్ సుధ, డాక్టర్ పి.అరుణ, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

### పేదలకు బియ్యం పంపిణీ



మహిళకు బియ్యం పంపిణీ చేస్తున్న పచ్చిరిపల్లి రాము

**అల్లిపురం:** పేదలకు మూడు కేజీల బియ్యం చొప్పున 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అందజేశారు. ప్రతి నెల చేపట్టే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పేదల ఇళ్లకు వెళ్లి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 25 మంది పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

### డాక్టర్ శ్రీవాత్సవ్‌కు అభినందనలు



డాక్టర్ శ్రీ వాత్సవ్‌తో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, తదితరులు

**మహారాణిపేట:** పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫైనల్ ఎగ్జామినేషన్‌లో 607 మార్కులు సాధించిన డాక్టర్ జి.శ్రీవాత్సవ్‌ను మంగళవారం పలువురు వైద్యులు అభినందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఇతర ఆర్థోపెడిక్ వైద్యులు శ్రీవాత్సవ్‌కు అభినందనలు తెలియజేశారు. శ్రీ వాత్సవ్‌కు రాష్ట్ర స్థాయి ఆర్థోపెడిక్స్‌లో అత్యధిక మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్ మార్గదర్శకత్వంలో శ్రీవాత్సవ్ మొదటి యూనిట్‌లో శిక్షణ పొందుతున్నారు. వైద్యులు లోక్‌నాథ్, ఎంసీహెచ్.నాయుడు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆర్థోపెడిక్స్ విభాగం వైద్యులు అభినందనలు తెలిపారు.

### జాబ్‌మేళాకు ప్రత్యేక సర్వీసులు

**దాబాగార్డెన్స్:** గీతం కళాశాలలో గురువారం నిర్వహించనున్న జాబ్ మేళాకు ఏపీఎస్ఆర్‌టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గీతం కాలేజీకి 900కే రూట్లో సిరిపురం, ఎంవీపీ మీదుగా గీతం కళాశాలకు 2 ప్రత్యేక సర్వీసులు ఆ రోజు ఉదయం నుంచి నడపనున్నట్టు చెప్పారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు ద్వారకాబస్‌స్టేషన్ (ఆర్టీసీ కాంప్లెక్స్)లో బయలుదేరి ఎండాడ జంక్షన్ దిగి అక్కడి నుంచి గీతం కళాశాలకు అభ్యర్థుల రద్దీని బట్టి బస్సులు నడపనున్నట్టు చెప్పారు. అలాగే ఆనందపురం, కొమ్మాది నుంచి వచ్చే అభ్యర్థులు ఎండాడలో దిగి ఆ బస్సులు ఆశ్రయించవచ్చు. అలాగే వివిధ రూట్ల నుంచి కూడా బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

### సాధనతో అంతఃకరణ శుద్ధి సాకారం



ప్రవచనాలు చెబుతున్న పరిపూర్ణా నందస్వామి

**మద్దిలపాలెం:** మనసుతో సాధన చేస్తే అంతఃకరణ శుద్ధి సాకారమవుతుందని, మనసు బుద్ధి , చిత్తంతో సాధనకు అనుకూలంగా మార్చుకుంటే మానసిక వికాసం పొందగలమని పరిపూర్ణనంద స్వామిజీ ప్రవచించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాలుగోవ రోజు మంగళవారం సాధన రహస్యం అనే అంశంపై ప్రసంగించారు. అహంకారం అనేది వీడితే విజయం చేకూరుతుందన్నారు. విశాఖ మ్యూజిక్ , డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు , ప్రధాన కార్యదర్శి డాక్టర్. గుమ్మలూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కళ్ల అబద్ధాలు



జీచ్‌రోడ్డులో నిరూప్ కూర్చోగానే.. ఓ యువకుడు వచ్చి సార్ ఇవి రేబాన్ కళ్లద్దాలు.. షోరూంలో రూ.2500కు తక్కువ ఉండవు. ప్రమోషన్‌లో భాగంగా రూ.1500కే విక్రయిస్తున్నాం..తీసుకోండి. అనగానే బేరమాడిన నిరూప్ రూ.1000కి తీసుకున్నాడు. రెండు రోజుల తర్వాత చూస్తే..వాటిపై ఉన్న రంగు కోల్పోయాయి. అప్పుడు అర్థమైంది. అవి రేబాన్ కాదు అని.

చదవడం కాస్త ఇబ్బందిగా ఉందని గ్రహించిన ప్రభాకర్.. జగదాంబలోని ఓ ఆప్టికల్ షోరూంకు వెళ్లి సమస్య తెలిపాడు. వెంటనే షాపులోని ఓ వ్యక్తి రీడింగ్ కళ్లద్దాలు రూ.1500కు ఇచ్చాడు. షాపులో ఉన్న మరో వ్యక్తి..సార్..మీరు హుందాగా కనిపిస్తున్నారు. ఈ గ్లాసెస్ పెట్టుకోండి. ఆఫీస్‌లోనూ స్టైలిష్‌గా ఉంటారు. కాకపోతే దీని ఖరీదు రూ.5000 అని చెప్పాడు. కాస్త తటపటాయించిన ప్రభాకర్..రూ.4వేలకు కొనుగోలు చేశాడు. వాటితో చదవడానికి ఇబ్బంది అనిపించడంతో దగ్గరల్లో ఉన్న మరో షోరూంకు వెళ్లి చూపించగా..అప్పుడు తెలిసింది..ఆ గ్లాసెస్ రూ.200 విలువ కూడా చెయ్యవని.





ఉచిత ఐ-టెస్టులు.. ఆపై ధరల మోత

నగరంలో బ్రాండెడ్ పేరుతో నకిలీ కళ్లజోళ్ల విక్రయాలు

వీటితో నష్టం తప్పదంటున్న వైద్యులు



### కంప్యూటర్ టెస్టింగ్‌లంటూ మోసం

చాలా ఆప్టికల్ దుకాణాల్లో నిబంధనల ప్రకారం డాక్టర్లను నియమించకుండా ఉచిత కంటి పరీక్షలంటూ ప్రచారం చేసుకుంటూ కంప్యూటర్ టెస్టింగ్‌లు చేస్తున్నారు. అవసరం లేకపోయినా..కళ్లద్దాలను అంటగడుతున్నారు. తలనొప్పి, కంటి చూపు ఇబ్బందుల విషయంలో డాక్టర్ల వద్దకు వెళ్లే 99 శాతం వరకూ మందులతో తగ్గిస్తుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో అయితేనే తప్ప కళ్లజోళ్లను రిఫర్ చేస్తారు. అది కూడా వైద్య పరీక్షల అనంతరం డాక్టర్లు 0.25 లెన్స్ నుంచి ప్రారంభించి కంటి అద్దాల్ని సిఫార్సు చేస్తుంటారు. అయితే చాలా ఆప్టికల్ దుకాణాల్లో మాత్రం ..దుకాణదారులే కంటి వైద్యుల అవతారం ఎత్తేస్తున్నారు. తెలిసీ తెలియని కంప్యూటర్ పరిజ్ఞానంతో పరీక్షలు నిర్వహించేస్తున్నారు. దుకాణానికి వచ్చిన వారితో ఎలాగైనా స్పెక్ట్స్ కొనేలా చేసేందుకు అవసరం లేకపోయినా..కంటి అద్దాల్ని కొనుగోలు చేయించేస్తున్నారు.

**దాబాగార్డెన్స్:** ఇది కేవలం వీరిద్దరి సమస్యే కాదు. ఎంతో మంది కళ్లద్దాల మాయాజాలంలో పడి మోసపోతున్నారు. అద్దాల్లో గ్లేర్, యాంటీ గ్లేర్ అద్దాలని ఉంటాయి. సామాన్యులకు ఈ వివరాలు తెలీవు. హార్డ్ మల్టీ కోటెడ్ లెన్స్ (హెచ్ఎంసీ) కంప్యూటర్ల నుంచి వచ్చే ఈఎంఐ రేడియన్లు కంటికి తగలకుండా చెయ్యడంతో పాటు సూర్య కిరణాల నుంచి కూడా కళ్లను రక్షిస్తాయి. కానీ మార్కెట్లో చైనా నుంచి దిగుమతి అయిన వస్తువుల ద్వారా తయారయ్యే కంటి అద్దాలకు మెరుగులు దిద్ది ఎక్కువ ధరకు అమ్ముతూ మోసగిస్తున్నారు. కొందరు పేరుగాంచిన బ్రాండెడ్ కంపెనీలకు చెందిన మోడళ్లను చౌక ధర వస్తువులతో తయారు చేసి వాటిపై స్టిక్కర్లు అతికించి మరీ మోసం చేస్తున్నారు.

ప్రపంచ ప్రఖ్యాతగాంచిన దాదాపు అన్ని బ్రాండెడ్ కంపెనీల పేరిట నకిలీ కళ్లజోళ్లు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇవన్నీ కేవలం రూ.100 నుంచి రూ.200లోపలే దొరుకుతున్నాయి. రేబాన్, పోలీస్, ఓక్లా, నైకాన్, ఫాస్ట్‌ట్రాక్..క్రిజల్ తదితర బ్రాండెడ్

**బ్రాండెడ్ అద్దాలు.. రూ.100**

నకిలీ గాగుల్స్ నగరంలో జగదాంబ, పూర్ణా మార్కెట్, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, గాజువాక, ఎంవీపీ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో చాలా మంది విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసిన కొద్ది రోజుల్లోనే వీటి లోపాలు బయటపడుతున్నాయి.

### వైద్యుల సూచనల మేరకే అద్దాలు వాడాలి

ఐ-టెస్టింగ్ పేరుతో ప్రజలను చాలా మంది మోసగిస్తున్నారు. రోడ్లపై లభించే నకిలీ బ్రాండెడ్ అద్దాల్ని వినియోగించకపోవడం చాలా మంచిది. కంప్యూటర్ టెస్టింగ్‌లను ఎప్పుడూ విశ్వసించవద్దు. వాటిని ఆస్పత్రుల్లో రీచెక్ చేయించుకోవాల్సిన అవసరం ఉంది. అనంతరమే కళ్లద్దాల్ని వాడాలా..వద్దా అన్నది నిర్ణయించుకోవల్సిన అవసరం ఉంది. అవసరం లేని అద్దాల్ని వినియోగించడం వల్ల కంటికి..తలకు.. తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదముంది. మార్కెట్లో రూ.500 నుంచి రూ.1000లోపు మంచి అద్దాలు అందుబాటులో ఉన్నాయి. కానీ కొందరు బ్రాండెడ్ పేరుతో మోసగిస్తున్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలి.

–డాక్టర్ హిమబిందు, నేత్ర వైద్య నిపుణురాలు

## గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గైనిక్ వైద్యులు

**మహారాణిపేట:** గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను జాతీయ ఇమ్యూనైజేషన్ షెడ్యూల్ కార్యక్రమంలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలువురు గైనిక్ వైద్యులు కోరారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నగరంలో రాక్‌డేల్ లేఅవుట్‌లో జరిగింది. పలువురు ప్రసూతి వైద్యులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. విశాఖ ప్రసూతి స్త్రీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గైనిక్ అబ్‌స్టెట్రీషియన్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.ఎల్ నర్సింగరావు మాట్లాడుతూ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై ఉన్న పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యదర్శి డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ అల్లూ నిహారిక, డాక్టర్ ఐ.వాణి తదతరులు ప్రసంగించారు. జాతీయ గైనిక్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సునీత వీడియో సందేశాన్ని వినిపించారు.

## కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**దాబాగార్డెన్స్:** నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నాయకుడికి వాసుపల్లి ఆపన్న హస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

**దాబాగార్డెన్స్:** దక్షిణ నియోజకవర్గ ప్రజల కష్టాలు తన సమస్యలుగా భావిస్తూ వారికి అండగా నిలుస్తూ, ఆపన్న హస్తమందిస్తూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ భరోసా కల్పిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ 29వ వార్డు నాయకుడు అడపా శివకు వైద్య ఖర్చుల కింద వాసుపల్లి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఇంటికి వెళ్లి డబ్బులు అందించి నేనున్నానంటూ భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో గతంలో పేదలకు అండగా నిలిచే పథకాలు అమలు చేశారని... ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పథకాలన్నీ ఎండమావులుగా మారాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, ముత్తాబత్తుల రమేష్, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, నియోజకవర్గ కల్చరల్ అధ్యక్షుడు సూర్యనాయుడు, నాయకులు కోరాడ సురేష్, నీలాపు లక్ష్మి, బుల్లెట్ రవి, తమ్మినేని శ్రీను, ఆరుగుల రాజు, అజయ్, గనకాల రాంరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

## 8న యల్లమ్మ జాతర



**దాబాగార్డెన్స్:** భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న యల్లమ్మ జాతర ఈ నెల 7, 8న పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 7న తొలేళ్ల ఉత్సవం, 8న జాతర జరపనున్నారు. మహా శివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పుల వీధి జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద యల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, దర్శనాలు, ఉదయం నుంచి మాలధారణ భక్తుల శూలాల ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం అగ్నిగుండం తొక్కుతారు. యల్లమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి పీఎల్ఎన్ రాజు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతున్నామని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## బుచ్చిరాజు సేవలు ప్రశంసనీయం



బుచ్చిరాజును సత్కరిస్తున్న వైద్యులు

**మహారాణిపేట:** వైద్య రంగానికి డాక్టర్ బుచ్చిరాజు అందించిన సేవలను పలువురు వైద్యులు ప్రశంసించారు. మంగళవారం మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్ కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు అభినందన సభలో పలువురు వైద్యులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్ఏఎన్ మూర్తి, న్యూరో సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ సుబ్రహ్మణ్యం, ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ కే.కృష్ణ కిషోర్, ప్రముఖ ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, బీజేపీ విశాఖ నగర అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామరాజు తదితరులు పాల్గొని బుచ్చిరాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ ఏపీ వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, ప్రొఫెసర్ పుల్లారావు, డాక్టర్ శ్రీ లక్ష్మి, టి.నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, చొక్కాకుల రాంబాబు, ఓ ఆల్బర్టు, వేంకటేశ్వరరావు, దేవర చంద్రశేఖర్, రామారావు, గోవింద్ సుశీల, సత్యనారాయణ, మచ్చ సోమేష్, ఈశ్వరరావు, శారద, సన్యాసమ్మ, తోటమ్మ పాల్గొన్నారు.

## భగవద్గీత పుస్తకాలు ఉచితంగా పంపిణీ



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు, గీతా ప్రచార సమితి, కొణతాల ఫౌండేషన్ సభ్యులు

**దాబాగార్డెన్స్:** గీతా ప్రచార సమితి, కొణతాల ఫౌండేషన్ సంయుక్తంగా గాయత్రిదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల పిల్లలకు భగవద్గీత పుస్తకాలు ఉచితంగా అందజేశారు. గీతా ప్రచార సమితి అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కొణతాల ఫౌండేషన్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్, పిల్లా నూకరాజు ముందుగా శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. 6 నుంచి 8 ఏళ్లలోపు చిన్నారులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భగవద్గీత అనేది వృద్ధాప్య దశలో కాకుండా బాల్య దశలోనే నేర్చుకోవాలని, భగవద్గీత ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఉందని, ఎన్నో భాషల్లో కూడా అందుబాటులో ఉందన్నారు. అంత గొప్ప పుస్తకం చదవడం వల్ల వ్యక్తి జీవితం ఎలా మలచుకోవాలో తెలుస్తుందన్నారు. బాల్య దశలోనే నేర్పిస్తే పిల్లలు చెడు మార్గంలో ప్రయాణించకుండా జీవితం పట్ల, సమాజం పట్ల అవగాహనతో పెరుగుతారన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కె.హరిత, మధు, సునీత, కామేశ్వరరావు పాల్గొన్నారు.

## 'సంక్రాంతికి వస్తున్నాం' సక్సెస్ మీట్

**దాబాగార్డెన్స్:** సంక్రాంతికి వస్తున్నాం చిత్రం విజయవంతంగా 50 రోజులు ప్రదర్శించి, రూ.300 కోట్లకు పైగా గ్రాస్‌తో రికార్డు సృష్టించిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. సిటీ వైడ్ వెంకటేష్, రానా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేంకటేశ్వర ఫిలిమ్స్ మేనేజర్ విజయ భాస్కర్, సురేష్ ఫిలిమ్స్ మేనేజర్ వేణుబాబు, వెంకటేష్, రానా, మహేష్‌బాబు అభిమానుల సంఘం గౌరవ సలహాదారుడు గంట్ల శ్రీనుబాబు, ఆర్జీ శంకరరావు తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం 50 రోజుల సినిమా విజయోత్సవం పురస్కరించుకొని లీలామహల్ థియేటర్ సిబ్బందికి నిత్యావసర వస్తువులు అందజేశారు.

## అఖిల భారత యోగా పోటీలకు డాక్టర్ లక్ష్మణరావు



డాక్టర్ లక్ష్మణరావును అభినందిస్తున్న ఏఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా దేవి

**మహారాణిపేట:** ఆంధ్ర మెడికల్ కళాశాల ఫ్యాకల్టీ, అనాటమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ రావు అఖిల భారత యోగా చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో పాల్గొనున్నారు. పోటీలు బుధవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు చండీగఢ్లో జరగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా దేవిని మర్యాద పూర్వకంగా కలిశారు. పోటీల్లో పాల్గొంటున్న డాక్టర్ లక్ష్మణరావు విజేతగా నిలవాలని సంధ్యాదేవి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ ఏ.కృష్ణవేణి, అనాటమీ హెచ్‌వోడీ డాక్టర్ రవీంద్ర కిషోర్, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ రాధిక, కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎస్.పాత్రుడు పాల్గొన్నారు.

## భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం

**మురళీనగర్ :** భద్రత కేవలం నిబంధన కాదని... సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజీందర్ చౌదరి అన్నారు. విశాఖపట్నం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరంతర విద్య, భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. ప్రజల్లో భద్రతా సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వేవ్స్ – 2025 సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ఛాలెంజ్‌లలో విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శించాలన్నారు. ఎన్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్, పరాక్రమ అవార్డు గ్రహీత డాక్టర్ జీపీఆర్ కృష్ణ భద్రతా చర్యల ప్రాముఖ్యత, నిత్య జీవితంలో పాటించాల్సిన నిబంధనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా "తల్లిపేరుతో ఒక మొక్క" అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. సీబీసీ సంగీత నాటక విభాగం కళాకారులు భద్రత ప్రాముఖ్యతపై తెలుగు గీతాలు ఆలపించారు.

## సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ డిమాండ్**

**సీతమ్మధార:** కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్లకు కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నాయకత్వంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చినా అమలు చేయని కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని, బేసిక్ వేతనంతోపాటు డీఏ, గ్రాట్యుటీ, ఇతర అలవెన్సులు, కుటుంబానికి మెడికల్ అలవెన్సులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ దృష్టికి న్యాయమైన డిమాండ్లను తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా పరిష్కరించమని కోరుతామన్నారు. నిరసనలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అత్యుతరావు, మన్మథరావు, మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి జేడీ నాయుడు, రాజబాబు, ప్రభుత్వ హాస్పిటల్ ఉద్యోగుల సంఘం నాయకులు అప్పలరాజు, గణేష్, రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పడాల రమణ, జి.వామనమూర్తి, పడాల గోవింద్, కాసుబాబు, ఎస్.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ సేవలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

**తాటిచెట్లపాలెం :** జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో రైల్వే న్యూ కాలనీ పరిధి కేఎస్ఎం గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు న్యాయ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ డివిజన్ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ మాట్లాడుతూ అవగాహన కల్పించారు. చిన్నారులపై శారీరక నేరాలు నియంత్రణ చట్టం – 2012పై వివరించారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా



రామాటాకీస్ కూడలిలో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

**సీతంపేట :** ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ధర్నాలో భాగంగా రామటాకీస్ కూడలి వద్ద మంగళవారం ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అధిక జరిమానాలకు కారణమవుతున్న 21, 31 జీవోలను రద్దు చేయాలని, డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసినట్టుగానే వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారని, భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్, టోల్‌ప్లాజా ఫీజులను 30 శాతం తగ్గిస్తామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు యు.శివాజీ, రావికృష్ణ, దేవుడు, ఈశ్వర్, ఎస్.అప్పలరాజు, టి.రవి పాల్గొన్నారు.